RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

వరంగల్ | సంచిక 273 | సంపుటి 4 | గురువారం | 02-07-2026 | పేజీలు 4 | వెల 3/-

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374



# వేం అన్నా..

## నువ్వే మాకు దిక్కన్నా..!

అభివృద్ధి అనేది ప్రజల జీవన ప్రమాణాలను పెంచడానికి కావాలి కానీ, ఉన్న జీవితాలను చిన్నాభిన్నం చేయడానికి కాదు. కేసముద్రం బాధితుల కన్నీళ్లకు పాలకులు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉంది. వేం నరేందర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి, మానవతా దృక్పథంతో బాధితులను ఆదుకుంటారా.. లేక 'అభివృద్ధి' ముసుగులో ఈ పేదల ఆక్రందనలను గాలికి వదిలేస్తారా అనేది వేచి చూడాలి.అభివృద్ధి చేస్తున్న మున్సిపల్ ఎన్నికలలో హంగ్ వచ్చింది. మరి ఈ పరిణామాలతో భవిష్యత్తులో పార్టీల మునుగడ ఎలా ఉండబోతుందో చూడాలి మరి.....



- కేసముద్రంలో బుల్డోజర్ల కింద నలిగిన సామాన్యుల కలలు
- ముందస్తు పునరావాసం లేకుండానే కూల్చివేతల పర్వం...??
- 'వేం అన్న' వైపు ఆశగా బాధితుల చూపు...
- ప్రజాప్రతినిధులపై పెరుగుతున్న వ్యతిరేకత!

**హైదరాబాద్, జూలై 01(ప్రభాత గమనం):**

అభివృద్ధి అనే రంగుల ప్రపంచం వెనుక సామాన్యుడి కన్నీటి గాథలు ఎప్పుడూ దాగివుంటాయి. కానీ, కేసముద్రం పట్టణ కేంద్రంలో జరుగుతున్న పరిణామాలు మాత్రం ఆ కన్నీళ్లను రోడ్డున పడేశాయి. పట్టణ సుందరీకరణ, రోడ్ల విస్తరణ అవసరమేనని దానిని ఎవరూ కాదనరు.. కానీ, ఆ విస్తరణ పేదవాడి పొట్ట కొట్టేలా, దశాబ్దాల ఉపాధిని ఒక్క రాత్రిలో బూడిద చేసేలా సాగాలా? అనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా వెల్లువెత్తుతున్నాయి. ముందస్తు వ్యూహం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా అధికారులు ప్రదర్శించిన 'బుల్డోజర్ సంస్కృతి' వందలాది కుటుంబాలను రోడ్డున పడేసింది.

**- 'రాత్రికి రాత్రే' మారిన బతుకు చిత్రం...**

దశాబ్దాలుగా కేసముద్రం మెయిన్ రోడ్డు పక్కన చిన్నపాటి కిరాణా కొట్టులు, మెకానిక్ షాపులు, హోటల్లు, పాన్ డబ్బాలు నడుపుకుంటూ రోజువారీ ఆదాయంతో బతుకీడుస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాల జీవితాలు ఒక్కసారిగా అస్తవ్యస్తమయ్యాయి. ఎలాంటి లిఖితపూర్వక గడువు లేదా ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపకుండానే అధికారులు షాపులను నేలమట్టం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.

**- కోల్పోయిన జీవనోపాధి...**

కిరాణా దుకాణాలు, ఆటో బైక్ మెకానిక్ షాపులు, వైర్ బెండింగ్, ఇంటర్నెట్ సెంటర్లు నడుపుకునే వందలాది మంది ఇటు ప్రత్యక్షంగా, అటు పరోక్షంగా ఉపాధి కోల్పోయారు. రోడ్డున పడ్డారు. ఆరుగాలం కష్టపడి కట్టుకున్న కలల ఇళ్లను, షాపులను నేలమట్టం చేసి రోడ్డున పడేసిన దుస్థితి. "రేపటి నుంచి పిల్లల చదువులు, ఇంటి అద్దెలు ఎలా కట్టాలి? అసలు రేపు మా పిల్లలకి అన్నం ఎలా పెట్టాలి?" అంటూ కన్నీరుమున్నీరవుతున్న మహిళల ఆవేదన ఇక్కడి భయానక పరిస్థితికి అద్దం పడుతోంది.

**- ప్రజాప్రతినిధుల 'మీనమేషాలు'.. బాధితుల ఆగ్రహం....**

ఎన్నికల సమయంలో ఓట్ల కోసం కాళ్ళు పట్టుకున్న నేతలు, ఇప్పుడు తమ బతుకులు రోడ్డున పడితే కనీసం వచ్చి పరామర్శించే నాయకుడు లేడన్న ఆగ్రహం బాధితుల్లో కట్టలు తెంచుకుంటోంది. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అభివృద్ధి పేరిట సామాన్యుడిని బలిచేస్తున్న తీరుపై స్థానికుల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. "రానున్న రోజుల్లో ఏ మొహం పెట్టుకుని మళ్లీ ఓట్లు అడగడానికి వస్తారో చూస్తాం" అంటూ బాధితులు హెచ్చరిస్తున్నారు. ఓట్లు వేసి గెలిపించినందుకు తమకు దక్కిన బహుమతి ఇదా అని ప్రశ్నిస్తున్నారు.

**- 'వేం అన్న' వైపు ఆశగా చూపులు....**

ఈ సంక్షోభంలో బాధితులంతా రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి వైపు ఆశగా చూస్తున్నారు. "వేం అన్న.. నీవే మాకు దిక్కు, మాకు న్యాయం చేయి" అంటూ వేడుకుంటున్నారు. మళ్లీ కొత్తగా షాపులు ఏర్పాటు చేసుకోవడానికి, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం తరపున పరిహారం లేదా వ్యక్తిగత సహాయం అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.కేసముద్రం ముద్దుబిడ్డ వేం నరేందర్ రెడ్డి బాధితుల ఆర్తనాథాలు వింటరాని నిరుపేదలు ఎదురు చూస్తున్నారు. అభివృద్ధి అడ్డు కాదని తమ బ్రతుకు బాట ఎలా సాగించాలో తెలపాలని నిరుపేదలు కోరుతున్నారు.




"రోడ్ల విస్తరణ పేరిట పేదలను వీధుల పాలు చేయడం దారుణం. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, మరియు అధికారులు వెంటనే స్పందించి సర్వే జరపాలి. నష్టపోయిన ప్రతి కుటుంబానికి తగిన పరిహారం ఇవ్వడంతో పాటు, వారికి స్వయం ఉపాధి కోసం ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలి. లేనిపక్షంలో బాధితుల తరపున పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతాం."

- ప్రజా సంఘాలు..

# ప్రజల భద్రతకు పెద్దపీట..

- శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యం
- ప్రజలకు చేరువగా సమర్థవంతమైన పోలీసింగ్
- వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ ఎస్.శ్వేతా రెడ్డి

— వివరాలు 2వ పేజీలో



**వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ అందుబాటులో ఉండే ప్రజా పోలీసింగ్ ను అమలు చేస్తామని ఆమె పేర్కొన్నారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్వేతా రెడ్డి ఉదయం పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి చేరుకోగా సాయుధ పోలీసు బలగాలు గౌరవ వందనం సమర్పించాయి.**

# మంచ్యాతండాలో భూభారతి రీసర్వే

- కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ సదస్సు నిర్వహణ
- భూ రికార్డుల ఖచ్చితత్వమే లక్ష్యం : తహసీల్దార్ కిరణ్ కుమార్

**చిన్నగూడూరు, జూలై 1(ప్రభాత గమనం):**

జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదేశాల మేరకు చిన్నగూడూరు మండలం మంచ్యతండ గ్రామ రైతు వేదికలో బుధవారం భూభారతి భూముల రీసర్వే కార్యక్రమం, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం భూ రికార్డులలో పారదర్శకత, ఖచ్చితత్వం సాధించేందుకు భూభారతి రీసర్వేను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. భూముల రికార్డులు స్పష్టతతో నమోదు కావడంతో భూ వివాదాలు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రీసర్వే ప్రక్రియలో రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు తదితర భూ సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచి సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని సూచించారు. భూములకు సంబంధించిన సందేహాలు, అభ్యంతరాలు ఉంటే వెంటనే రెవెన్యూ అధికారులకు తెలియజేయాలని ఆయన కోరారు. రీసర్వే పూర్తైన అనంతరం భూ రికార్డులు మరింత కచ్చితత్వంతో అందుబాటులోకి వస్తాయని, భవిష్యత్తులో భూ లావాదేవీలు, వారసత్వ



మార్పులు, ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తహసీల్దార్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో భూభారతి రీసర్వేను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాములు, వ్యవసాయ అధికారి భాస్కర్, రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బంది, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ దారుణ హత్య

- ఇంటి ముందు నిద్రిస్తుండగా మారణాయుధాలతో దాడి
- మహబూబాబాద్ జిల్లా సింగారం గ్రామంలో ఘటన



నెల్లికుదురు, జూలై 1(ప్రభాత గమనం):

మహబూబాబాద్ జిల్లాలోని సింగారం గ్రామంలో మాజీ సర్పంచ్ పిట్టల యాకయ్య (57) దారుణ హత్యకు గురైన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఇంటి ముందు వరండాలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని దుండగులు మారణాయుధాలతో దాడి చేసి అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి యాకయ్య తన ఇంటి ముందు వరండాలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు అక్కడికి చేరుకుని విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. అనంతరం నిందితులు ఘటనాస్థలం నుంచి పరారయ్యారు. బుధవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు బయటకు వచ్చి చూడగా యాకయ్య రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ హత్యకు వ్యక్తిగత విభేదాలు, పాత కక్షలు లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించడంతో పాటు స్థానికులను విచారిస్తున్నట్లు సమాచారం. మాజీ సర్పంచ్ యాకయ్య హత్యతో సింగారం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.



## లాభదాయక సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

- వ్యవసాయాధికారులతో సమావేశంలో కలెక్టర్ స్నేహ శబరిష్

మహబూబాబాద్, జూలై 01(ప్రభాత గమనం):

లాభదాయక వ్యవసాయ విధానాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో పంట మార్పిడి పై శాస్త్రవేత్తలు మరియు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులను లాభదాయక వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించాలని, నూతన పంటలైన కోకో, కొబ్బరి, వక్క, నిమ్మగడ్డి, సిట్రోనెల్ల, పామరోసా, జేరేనియం పంటలతో పాటు నిత్యం అవసరమైన కూరగాయల సాగు రైతులతో, స్వయం సహాయ సంఘాలతో సాగు చేసే విధంగా అవగాహన చేసి అన్ని రకాల రాయితీలు, సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఔషధ మొక్కల సాగుకు సంబంధించి సంబందిత కంపనిలతో, స్వయం సహాయ సంఘాలతో అనుసంధానం చేయాలని తెలిపారు. అన్ని రకాల కూరగాయల సాగును పైలట్ ప్రాజెక్ట్ ద్వారా చేపట్టి ప్రభుత్వ వసతి గృహాలకు తాజా కూరగాయలు సరఫరా అయ్యేవిధంగా స్వయం సహాయ సంఘాలను ప్రోత్సహించాలని అన్నారు. ప్రతీ గ్రామంలో 50 ఎకరాలలో మార్కెట్ డిమాండ్ ఉన్న అన్ని రకాల కూరగాయలు, ఆయిల్ పామ్, నూనె గింజలు, చిరు ధాన్యాలు, అపరాలు, మొదలైన రోజు వారి అవసరమైన పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఔషధ మరియు సుగంధ పంటల సాగులో మెళుకువలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం డా. వి. కృష్ణవేణి, ప్రధాన శాస్త్రవేత్త, , ములుగు, సిద్దిపేట జిల్లా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జి. మధుసూదన్ రాజు, జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న, జిల్లా షెడ్యూల్ కులాల అధికారి కె. శ్రీనివాస్, డా. ప్రశాంత్ హెడ్ ఉద్యాన పరిశోధన స్థానం, మల్యాల, ఉద్యాన అధికారి ఎ. జె. శాంతి ప్రియదర్శిని, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పదవికి బక్క పుల్లయ్య రాజీనామా

పాలకుర్తి, జులై 1(ప్రభాత గమనం):



జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు బక్కపుల్లయ్య బుధవారం నాడు పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ఎన్నో సంవత్సరాలనుండి పార్టీ సిందంతాలను నమ్మి, నమ్ముకున్న పార్టీ కోసం నిరంతరం కష్టపడి పనిచేసానని తెలిపారు. పార్టీ కష్టకాలంలో ఉన్నపుడు కూడా వెనకడుగు వేయకుండా, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కోసం నా సాయశక్తులా కృషి చేసానని తెలిపారు. ఎన్నో కార్యక్రమాలను విజయవంతం చేస్తూ, తోటి కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగానన్నారు. పార్టీకి అధికారం లేని రోజుల్లో కాంగ్రెస్ సర్పంచ్ గా గెలిచి నా బలాన్ని నిరూపించుకున్నానని తెలిపారు. గత ప్రభుత్వం అనేక ఇబ్బధులకు గురించేసిన, చివరికి నేను అధికారంలో ఉంటే వాళ్ల ఆటలు సాగవు అని నా మీద అబద్ధపు కేసులు పెట్టి సస్పెండ్ చేయించారని తెలిపారు. కానీ నా నిజాయితీ నన్ను నిర్దోషిగా నిలబెట్టిందని పేర్కొన్నారు. తిరిగి మళ్లీ సర్పంచ్ కుర్చీలో కూర్చుని నా పదవీకాలం పూర్తి చేశానని తెలిపారు. ఈ విధంగా ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నానని తెలిపారు. కాంగ్రెస్ జెండాను మోస్తూ, పార్టీ కోసం కేసులు ఎదుర్కొన్నానన్నారు. ఎన్నో అవమానాలు భరించాను. దాడులను ఎదుర్కొన్నాని అన్నారు. ప్రతి కష్టసమయంలో పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటూ వెంటే నిలబడి, పార్టీ బలోపేతం కోసం నా శక్తివంచన లేకుండా పనిచేశానని తెలిపారు. కానీ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండు సంవత్సరాలుగా నా సేవలకు తగిన గుర్తింపు లభించలేదు. పార్టీ సమావేశాల్లో కూడా నాకు తగిన గౌరవం దక్కలేదన్నారు. ఎన్నో ఆశలతో, బాధను మనసులో దాచుకుని పార్టీ కోసం పనిచేస్తూనే ఉన్నాను.ఏ రోజుకైనా నా సేవలను పార్టీ గుర్తిస్తుందని అనుకున్నానని తెలిపారు.కానీ నా కష్టానికి, నిబద్ధతకు విలువ లేదనే భావన రోజు రోజుకూ మరింత బలపడిందన్నారు. ప్రతి రోజు ప్రజల మధ్యన ఉంటూ ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు నడిచానని తెలిపారు.పదవి అనేది నాకు ముఖ్యం కాదని తెలిపారు. కానీ పార్టీ కోసం కష్టపడిన ఒక కార్యకర్తకు కనీస గౌరవం, గుర్తింపు కూడా లేకపోవడం ఎంతో బాధ కలిగించిందని పేర్కొన్నారు. ఆ బాధతోనే జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నానని అన్నారు.

## గార్ల సీహెచ్‌సీలో స్కానింగ్, ఈసీజీ సౌకర్యాలు కల్పించాలి

- ఆసుపత్రి సమస్యలపై రోగులతో కలిసి సీపీఎం భారీ ఆందోళన
- డయాలసిస్ సెంటర్, పోస్ట్ మార్టం గదిని తక్షణమే ప్రారంభించాలని విజ్ఞప్తి

గార్ల, జూలై 1 (ప్రభాత గమనం) :



మండల కేంద్రంలోని 30 పడకల సమాజ ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల కోసం తక్షణమే ఈసీజీ, స్కానింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో రోగులతో కలిసి ఆసుపత్రి ప్రాంగణంలో భారీ ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. గత కొన్నేళ్ల క్రితం అన్ని సౌకర్యాలతో నిర్మించిన పోస్ట్‌మార్టం గది ఇప్పటికీ అందుబాటులోకి రాలేదని, దాన్ని తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల ఆసుపత్రికి మంజూరైన డయాలసిస్ సెంటర్ సేవలను కూడా వెంటనే అందుబాటులోకి తీసుకురావాలన్నారు.ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రిలో తగినంత మంది వైద్యులను, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులను సరఫరా చేయాలన్నారు. కరోనా కష్టకాలంలో ఎంతోమంది ప్రాణాలు నిలిపిన ఆక్సిజన్ ప్లాంట్‌ను పునఃప్రారంభించాలనే ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సతీష్‌కు అందజేశారు.ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు వి.పి. వెంకటేశ్వర్లు, ఎం. నాగమణి, కె. ఈశ్వర్ లింగం, సిహెచ్. ఎల్లయ్య, సిహెచ్. మౌనిక, కె. రామకృష్ణ, వి. కొండయ్య, టి. నాగేశ్వరరావులతో పాటు పార్టీ కార్యకర్తలు, రోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## అర్హుల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలి

- కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- రాష్ట్రంలో రానున్నది బీఆర్ఎస్ రాజ్యమే
- మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్

కేసముద్రం, జూలై 1(ప్రభాత గమనం):

ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ను పార్టీ నాయకులు కార్యకర్తలు సీరియస్ గా తీసుకోవాలని, కాంగ్రెస్ నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని రాష్ట్రంలో అధికారంలోకి రానున్నది బిఆర్ఎస్ పార్టీనే అని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. బుధవారం కేసముద్రం మండల కేంద్రంలో సర్ శిక్షణ బిఆర్ఎస్ పార్టీ సభ్యత నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు... పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించాలన్నారు.ప్రతి బూత్ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరిని పార్టీ సభ్యత్వంలో చేర్చేలా కార్యాచరణ చేపట్టాలని తెలిపారు.సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయడానికి బిఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సర్ కార్యక్రమంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకునేలా కృషి చేయాలని అన్నారు.సభ్యత్వ నమోదు మరియు సర్ కార్యక్రమంలో మహబూబాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా నిలిపేలా ప్రతి నాయకుడు, కార్యకర్త అంకిత భావంతో పనిచేయాలని పేర్కొన్నారు.బూత్ కన్వీనర్లు, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిలు గ్రామ సర్పంచ్‌లు, సర్పంచ్ అభ్యర్థులు, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటీసీలు, సహకార సంఘాల డైరెక్టర్లు, వార్డు సభ్యులకు అండగా నిలిచి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రవిచంద్ర రెడ్డి,మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, మాజీ ప్రెసిడెంట్లు నజీర్,వీరు నాయక్,పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ కన్వీనర్లు,బిఎల్ఏలు, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒరిజినల్ కాంగ్రెస్ నేతలకు గుర్తింపు లేదు

- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అసంతృప్తి
- పార్టీలో కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యం పెరుగుతోందని వ్యాఖ్య

నల్గొండ, జూలై 1(ప్రభాత గమనం):



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారశైలిపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ..పార్టీలో మొదటి నుంచి ఉన్న అసలు కాంగ్రెస్ నాయకులకు తగిన గుర్తింపు లభించడం లేదని, కొత్తగా చేరిన వారికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. తాను యాదాద్రి భువనగిరి జిల్లా ఎమ్మెల్యేనని, తనను సంప్రదించకుండా ట్రస్ట్ బోర్డు, నూతన కార్యవర్గం ఏర్పాటు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్
- బీఎల్ వోల ఇంటింటి ఫారాల పంపిణీ పరిశీలన



మహబూబాబాద్, జూలై 01(ప్రభాత గమనం):

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని కంబాలపల్లి గ్రామంలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని పేర్కొన్న కలెక్టర్, అధికారులు, బీఎల్‌వోలు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని 35 వార్డులో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, లకు సిబ్బంది ఫారాల అందజేశారు. జిల్లా వ్యాప్తంగా పక్కా ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని షెడ్యూలు ప్రకారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాలు నిర్వహించి పూర్తి సమాచారం అందించడం జరుగుతుందని, క్షేత్రస్థాయిలో సోషల్ మీడియా వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఏఈఆర్ఓ కట్టంచంద్ర రాజేశ్వర్ రావు, బిఎల్ఓ సూపర్వైజర్ జి.కవిత, బిఎల్వో పి.కనక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 'వీబీజీ రాంజీ' చట్టాన్ని రద్దు చేయాలి

- గార్లలో ఉపాధి కూలీల భారీ నిరసన
- ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా అమలు చేయాలని డిమాండ్
- రైతు, వ్య.కా.స, సీఐటీయూల ఆధ్వర్యంలో గ్రామాల్లో పెల్లుబికిన ఆగ్రహం




గార్ల ,జూలై 1 (ప్రభాత గమనం) :

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన '(విబిజీ రాంజీ') చట్టాన్ని తక్షణమే రద్దు చేసి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గార్ల మండలంలో బుధవారం భారీ ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. వ్య.కా.స (వ్యవసాయ కార్మిక సంఘం), తెలంగాణ రైతు సంఘం, సీఐటీయూ రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు మండల కేంద్రంతో పాటు పినిరెడ్డిగూడెం, గోపాలపురం ప్రధాన సెంటర్లలో రైతులు, ఉపాధి కూలీలు, కార్మికులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళన నిర్వహించారు.ఈ నిరసన ప్రదర్శనల్లో వ్య.కా.స రాష్ట్ర నాయకులు వంగూరి వెంకటేశ్వర్లు, రైతు సంఘం మండల నాయకులు బి. ఉపేందర్ రెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకురాలు చింత మౌనికలు పాల్గొని మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనేది ఉపాధి కూలీలకు ఒక చట్టబద్ధమైన హక్కు అని, అయితే కొత్తగా తెచ్చిన విబిజీ రాంజీ చట్టం వల్ల కూలీలు తమ ప్రాథమిక హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్రం ప్రవేశపెట్టిన ఆధార్ ఆధారిత పేమెంట్లు, ఫేషియల్ రికగ్నిషన్ , ఆన్‌లైన్ హాజరు వంటి నిబంధనల వల్ల సాంకేతిక సమస్యలు తలెత్తి, నిరుపేద కూలీల పేర్లు ఉపాధి లిస్టుల నుండి తొలగించబడే ముప్పు ఉందని వారు మండిపడ్డారు. అంతేకాకుండా, నిధుల కోతతో ఆర్థిక భారం పడి రాబోయే రోజుల్లో ఉపాధి పని దినాల సంఖ్య కూడా భారీగా తగ్గిపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.అంతకుముందు, స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి కూలీలు, రైతులు పట్టణ పురవీధుల్లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సర్పంచ్ బానోత్ పార్వతి హతిరం నాయక్‌కు అందజేశారు.ఈ కార్యక్రమంలో వ్య.కా.స మండల గౌరవ అధ్యక్షురాలు అలవాల సత్యవతి, కందునూరి కవిత, ముఖ్య నాయకులు కె.రామకృష్ణ, ఏ. వీరస్వామి, యం. నాగమణి, ఐ. గోవిందు, కె. ఈశ్వర్ లింగం, సిహెచ్. ఎల్లయ్య, వి. కొండయ్య, జి. సీతారాం, బి. నరేష్, సతీష్‌లతో పాటు ఉపాధి మేట్లు ఎం. కొండయ్య, జ్యోతి, రైతు ప్రతినిధులు ఏ. శివాజీ, సురేష్, వెంకటరెడ్డి మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ప్రతి మండలంలో జనరిక్ పశు ఔషధ కేంద్రం ఏర్పాటు చేయాలి

- పాడి రైతులకు నాణ్యమైన మందులు తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావాలి :జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



జిల్లాలో పశుపోషక రైతులకు నాణ్యమైన పశు ఔషధాలను సరసమైన ధరలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రతి మండలంలో ఒకటి, జిల్లా కేంద్రంలో మరో జనరిక్ పశు ఔషధ విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జనరిక్ పశు ఔషధ విక్రయ కేంద్రాల ఏర్పాటుపై వ్యవసాయ, సహకార, డీఆర్‌డీఏ, పశుసంవర్ధక శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయానికి అనుబంధ రంగమైన పశుపోషణ గ్రామీణ కుటుంబాలకు అదనపు ఆదాయ వనరుగా మారుతోందని, అలాంటి పరిస్థితుల్లో పశువుల ఆరోగ్య సంరక్షణకు నాణ్యమైన వైద్య సేవలు, ప్రమాణాలకు అనుగుణమైన ఔషధాలు తక్కువ ధరలకు అందుబాటులో ఉండటం అత్యంత అవసరమని తెలిపారు. మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించే మందులకు ప్రత్యామ్నాయంగా నాణ్యతలో రాజీ లేకుండా జనరిక్ పశు ఔషధాలను రైతులకు అందించడం ద్వారా వారి ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రతి మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పిఏసీఎస్), డీఆర్‌డీఏ, వ్యవసాయ శాఖల సమన్వయంతో జనరిక్ పశు ఔషధ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో ఐనవోలు మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్.పి.ఓ) ఆధ్వర్యంలో ప్రత్యేక జనరిక్ పశు ఔషధ విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కేంద్రాల ద్వారా పశువులకు అవసరమైన నాణ్యమైన మందులు, వ్యాక్సిన్లు, ఖనిజ మిశ్రమాలు, పోషకాహార ఉత్పత్తులు, పశు ఆరోగ్య సంరక్షణకు అవసరమైన ఇతర సామగ్రిని సరసమైన ధరలకు రైతులకు అందుబాటులో ఉంచేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే ఔషధాల సరఫరా వ్యవస్థ, నిల్వలు, నాణ్యత ప్రమాణాలు, నిర్వహణ, రైతులకు అవగాహన కార్యక్రమాలు వంటి అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సమీక్ష సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీను, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రాధాకిషన్‌తో పాటు వ్యవసాయ, సహకార, డీఆర్‌డీఏ, పశుసంవర్ధక శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



# భూపాలపల్లి పీఎస్ ను తనిఖీ చేసిన ఎస్పీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

భూపాలపల్లి జిల్లాలో పోలీసు సేవలను మరింత మెరుగుపర్చే దిశగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, బుధవారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ప్రజల ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించి, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా పనిచేయాలని సిబ్బందికి ఆదేశించారు.

# బాల కార్మికులు లేని జిల్లాను నిర్మిద్దాం

- బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవు
- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ములుగు జిల్లా ఎస్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమన్వయ శాఖల తో ఆపరేషన్ ముస్కాన్ – సమన్వయ సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకాన్ మాట్లాడుతూ బాల్యం ఎంతో అమూల్యమైనది అని, వారంతా ఈ దేశ భవిష్యత్తు, వారికి ఉన్న వివిధ సమస్యల మూలంగా వారి ఎదుగుదలను కోల్పోవద్దనే ఉద్దేశ్యంతోనే ఈ ఆపరేషన్ ముస్కాన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సరైన అతి సున్నితమైన బాల్యానికి, వారి హక్కుల పరిరక్షణకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉన్నదని అన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం అంతా అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో 80 కి పైగా ఉన్న గుత్తికోయ ఆవాస గ్రామాల్లో డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. ఆపరేషన్ ముస్కాన్ – XII భాగంగా స్పెషల్ డ్రైవ్ లో పాల్గొని వారందరినీ ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేస్తూ వారి స్థితిగతుల ఆధారంగా వారికి అవసరమైన సహకారం అందించాలని ఆపరేషన్ ముస్కాన్ జిల్లా ఇంచార్జి కి సూచించారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే కఠినచర్యలు చర్యలు తప్పవని, జిల్లాను బాలకార్మిక రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతీ ఒక్కరూ వంతు పాత్ర వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమానికి సభాధ్యక్షత వహించినటువంటి జిల్లా సంక్షేమాధికారి ప్రేమలత మాట్లాడుతూ గత ఆపరేషన్ ముస్కాన్ ఉద్దేశ్యాలను, ముందున్న లక్ష్యాలను గూర్చి వివరించారు. ముస్కాన్ విధులకు కేటాయించబడిన సిబ్బంది ఈ జులై 1 నుంచి నుండి జులై 31 వరకు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్





లో భాగంగా నెల రోజుల పాటు వివిధ కేటగిరీలకు చెందిన చిన్నారులను ముఖ్యంగా తప్పిపోయిన బాలలు, అక్రమ రవాణాకు గురవుతున్న బాలలు, బాల కార్మికులు, డ్రాప్ అవుట్ అయిన బాలలు, వివిధ వేధింపులకు గురవుతున్న బాలలు సంరక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ రోజు మనం రక్షిస్తున్న చిన్నారులకు మన వల్ల మంచి చక్కని జీవితం ఉంటుందనే భరోసా కలిగేలా పని చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ గా వ్యవహరించిన డి.ఎస్.పి కిషోర్ మాట్లాడుతూ, జిల్లాలో ములుగు & ఏటూరునాగారం పోలీస్ సబ్ డివిజన్ల వారీగా ఈ స్పెషల్ డ్రైవ్ ను క్షేత్ర స్థాయిలో అన్ని విభాగాలు ఎంతో సమన్వయంతో నిర్వహించాలని అన్నారు. అనంతరంఫీల్డ్ లో రెస్క్యూ చేసిన పిల్లలను పనిలో పెట్టుకున్నవారిపై చట్టపరంగా కేసులు పెట్టాలని అన్నారు. గుత్తికోయ ఆవాస గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి అక్కడ పిల్లలు డ్రాప్ అవుట్ కాకుండా అందరూ బడికి వెళ్లేలా చూడాలని సూచించారు.

# ఏజెన్సీ ప్రాంత జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ చూపాలి
- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సభ్యత్వ నమోదులో జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్

**కొత్తగూడ, జూలై 1(ప్రభాత గమనం):**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్, ఐజేయు కొత్తగూడ మండల కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడ మండలంలోని గుంజేడు ముసలమ్మ తల్లి దేవస్థానం ప్రాంగణంలో మండల అధ్యక్షుడు ఎస్.కె. సల్మాన్ పాషా అధ్యక్షతన బుధవారం సభ్యత్వాల పునరుద్ధరణ మరియు నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు దూలం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు శ్రీ చిత్తనూరి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ గాడిపెల్లి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఐక్యతే యూనియన్ బలోపేతానికి మూలమని అన్నారు. ప్రతి జర్నలిస్టు యూనియన్ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవడంతో పాటు కొత్తగా అర్హులైన జర్నలిస్టులు సభ్యత్వం పొందాలని సూచించారు. యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు అనేక ఇబ్బందులు, మౌలిక సదుపాయాల కొరత, రవాణా సమస్యలు, వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత ముద్దుబిడ్డ, రాష్ట్ర మంత్రి శ్రీమతి సీతక్క ఈ అంశంపై ప్రత్యేక చొరవ చూపి, ఏజెన్సీ ప్రాంత జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నందున వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అనంతరం సభ్యులందరూ సభ్యత్వాల పునరుద్ధరణతో పాటు కొత్త సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశంలో యూనియన్ బలోపేతం, సభ్యుల ఐక్యత, జర్నలిస్టుల సంక్షేమం కోసం జిల్లా కమిటీ చేపట్టే కార్యక్రమాలకు పూర్తి సహకారం అందించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉమ్మగాని మధు,రమణ, సత్యనారాయణ, కోరే పాపన్న, రావూరి ప్రశాంత్, పాలడుగు శ్రీధర్, జంగాల వినయ్ కుమార్, మహమ్మద్ అజ్మీర్, శెట్టి పరశురాములు, మండల ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, వెంకటేశ్వర్లు, మండల ముఖ్య సలహాదారులు సునీల్, ప్రచార కార్యదర్శులు ఉబ్బని శ్రీహరి, తీగల ప్రేమ్ సాగర్, రాకేష్ వర్మ, చాపల శ్రీనివాస్, నాంపల్లి రాజ్ కుమార్, వాసం వెంకటేష్, తాటి సుదర్శన్, బిక్షపతి, యూనియన్ నాయకులు, మండల ప్రతినిధులు, సభ్యులు మరియు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.






# సైబర్ నేరాలు, డ్రగ్స్ ఉచ్చులో యువత పడొద్దు

- డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి
- ఇన్ స్పెక్టర్ ఆకునూరి మహేందర్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాలు దాల్చుతున్నాయని, అదే సమయంలో యువతను లక్ష్యంగా చేసుకుని మాదకద్రవ్యాల మాఫియా తమ కార్యకలాపాలను విస్తరిస్తోందని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ తెలిపారు. విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉంటేనే ఇటువంటి నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని ఆయన పేర్కొన్నారు. హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో "సైబర్ భద్రత – డ్రగ్స్ రహిత సమాజం" అనే అంశాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కాలంలో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండటంతో సైబర్ నేరగాళ్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్, ఫేక్ పోలీస్ కాల్స్, కోర్టు అధికారుల పేర్లతో బెదిరింపులు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయంటూ పెట్టుబడుల పేరుతో జరిగే మోసాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసే మోసాలు, నకిలీ లోన్ యాప్‌లు, ఫిషింగ్ లింకులు, క్యూఆర్ కోడ్ స్కామ్‌లు, సోషల్ మీడియా హ్యాకింగ్ వంటి అనేక రకాల సైబర్ నేరాలపై విద్యార్థులకు వివరించారు. వాట్సాప్, టెలిగ్రామ్, ఈ–మెయిల్ లేదా ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయరాదని సూచించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ వంటి సామాజిక సమస్యలను అరికట్టడంలో పోలీసులు మాత్రమే కాకుండా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, హసన్‌పర్తి పోలీస్ సిబ్బంది, విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని సైబర్ భద్రత, డ్రగ్స్ నిర్మూలనపై పోలీసుల సూచనలను ఆసక్తిగా విన్నారు.



# ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలే..

- డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అజ్మీరా శ్రీనివాస్ రావు
- విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

**కేసముద్రం, జులై1(ప్రభాత గమనం):**

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మహబూబాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అజ్మీరా శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం కేసముద్రం మండలంలోని పలు ఎరువులు,విత్తనాల దుకాణాలను ఏవో వెంకన్న తో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఎరువుల నిల్వలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, ఇన్వాయిస్లు, పిఓఎస్ మిషన్ బ్యాలెన్స్, గోదాము బ్యాలెన్స్, స్టాక్ బోర్డులను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రతి ఎరువుల డీలర్ రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, స్టాక్ రిజిస్టర్ నిల్వలు పిఓఎస్ నిల్వలు,గోడౌన్ బ్యాలెన్స్ నిల్వలు సమానంగా ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. ప్రతి డీలర్ ఎరువుల కంపెనీకి సంబంధించిన ఓ ఫామ్ లను ఎరువుల లైసెన్స్ లో పొందుపరచలన్నారు. డీలర్లు కనీస మద్దతు ధరకు మాత్రమే ఎరువులను అమ్మాలని, ఎవరైనా డీలర్లు ఎరువులను అధిక ధరలకు విక్రయించినట్లైతే ఎరువుల నియంత్రణ చట్టం 1985, నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# చింతలపల్లి రైల్వే గేట్ వద్ద భారీగా గంజాయి పట్టివేత

- యూపీ రాష్ట్రానికి చెందిన వ్యక్తి అరెస్ట్
- 9.418 కిలోల డ్రై గంజాయి, మొబైల్ స్వాధీనం

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు సంగెం పోలీసులు నిరంతరం నిఘా ఉంచారు. మంగళవారం రోజున మధ్యాహ్నం సంగెం ఎస్.ఐ. కె. వంశీ కృష్ణ తన సిబ్బందితో కలిసి చింతలపల్లి రైల్వే గేట్ వద్ద వాహనాల తనిఖీలు మరియు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా భారీగా గంజాయి పట్టుబడింది. రెండు బ్యాగులతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, అతని వద్ద ఉన్న బ్యాగుల్లో 10 ప్యాకెట్లలో ప్యాక్ చేసిన మొత్తం 9.418 కిలోల డ్రై గంజాయి లభ్యమైంది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.4,70,900/- ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. నిందితుడి నుంచి గంజాయితో పాటు ఒక శాంసంగ్ మొబైల్ ఫోన్, రూ.530/- నగదును స్వాధీనం చేసుకున్నారు.

**టెక్స్ టైల్ పార్క్ కార్మికులే లక్ష్యంగా..**

పోలీసుల విచారణలో నిందితుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన షోయబ్ ఖాన్ (34) అని తేలింది. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోవడానికే ఈ గంజాయిని తీసుకువచ్చినట్లు నిందితుడు అంగీకరించాడు. ఈ మేరకు సంగెం పోలీస్





స్టేషన్ లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో పర్వతగిరి సీఐ రాజగోపాల్ దర్యాప్తు అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ గంజాయి సరఫరా గొలుసు వెనుక ఉన్న మిగతా నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. కాగా, చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ వంశీకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ బాబు, కానిస్టేబుళ్లు శ్రవణ్, నవీన్, పాషా, వీరన్న, రాజులను మామునూరు ఏసీపీ ఎన్. వెంకటేష్ ప్రత్యేకంగా అభినందించారు. మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాల సమాచారం తెలిస్తే ప్రజలు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు తెలియజేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.

# బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల ప్రధాన బాధ్యత

- నాణ్యమైన దర్యాప్తు, ప్రజాకేంద్రీకృత పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి
- జిల్లా ఎస్పీ డా. శబరీష్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, మరిపెడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని స్టేషన్ రికార్డులు, సీడీ ఫైళ్లు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, స్టేషన్ నిర్వహణ, వివిధ గదులు, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. మరిపెడ ఎస్ఐతో పెండింగ్ ఫైళ్లు, దర్యాప్తులో ఉన్న కేసులు, విచారణ నివేదికల తయారీ, వాటి నాణ్యత, సమయపాలనపై సమీక్ష నిర్వహించి, ప్రతి కేసులో చట్టపరమైన విధివిధానాలను కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై వారి విధుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా విలేజ్ పోలీస్ ఆఫీసర్లతో ప్రత్యేకంగా మాట్లాడి, గ్రామాల్లో ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని, నేరాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణ, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, అనుమానాస్పద వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి పోలీసులకు అందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి చట్ట ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.




బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే దర్యాప్తు అధికారులు ప్రతి కేసుకు సంబంధించిన విచారణ నివేదికలను సమగ్రంగా, వాస్తవాధారాలతో సిద్ధం చేయాలని, ఫైళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో, పారదర్శకంగా, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని, మహిళలు, చిన్నారులు, వృద్ధులు వంటి బాధితులకు ప్రత్యేక ప్రాధాన్యతతో స్పందించాలని సూచించారు. సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలపై అప్రమత్తంగా వ్యవహరించి, నేరాల నియంత్రణలో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, పోలీస్ స్టేషన్‌ను ప్రజలకు నమ్మకమైన సేవా కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్, సూచించారు.

# వీబీజీ రాంజీ చట్టాన్ని రద్దుచేయాలి

- మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి
- ఎంపీడీఓకు వినతిపత్రం అందజేసిన కార్మిక సంఘాలు

**కేసముద్రం, జూలై 1 (ప్రభాత గమనం):**

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం , తెలంగాణ రైతు సంఘం , సీఐటీయూ మండల కమిటీల ఆధ్వర్యంలో విబిజి -రాంజీ చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005, యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ, ఆందోళన నిర్వహించి ఎంపీడీవో క్రాంతికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షులు,గోడిశాల వెంకన్న, నీరుటి జలంధర్ లు మాట్లాడుతూ..కరువులు వలసల నివారణకు దశాబ్దాల పోరాటం ఫలితంగా 2005 యూపీఏ-1 ప్రభుత్వం వామపక్ష పార్టీల ఎంపీల మద్దతుతో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టంఅమలు జరిగింది. 20 సంవత్సరాలు అనేక ఆర్థిక సంక్షోభల నుండి భారత దేశ ప్రజలను బయటపడేసింది. ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి వి వి జి రామ్ జి పేరుతో చట్టం చేసి 2026జూలై 1 నుంచి అమలు చేస్తున్నారు. పాత చట్టం 90 శాతంకేంద్రం, 10 శాతం రాష్ట్రం నిధులు కేటాయించి ఖర్చు చేశారు.ఇప్పుడు తెచ్చిన కొత్త చట్టం ప్రకారం 60 శాతం కేంద్రం 40 శాతం రాష్ట్రం నిధులు కేటాయించి అమలు చేయాలని మెలికబెట్టడం రాష్ట్రాల ఆదాయాలు లేకుండా చేసి ఉపాది చట్టాన్ని నీరుగార్చడం కోసం కేంద్రప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తుందన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం యధావిధిగా కొనసాగించి వివిజి రాంజీ రద్దు చేయాలని, ప్రతి సంవత్సరం, 200 రోజులు పని కల్పించి రోజుకు 600 వేతనం ఇవ్వాలని, ముఖ ఆధారిత రెండు పూటలా హాజరు తీసుకుని పద్ధతి రద్దు చేయాలని, పని ప్రదేశంలో టెంటు మెడికల్ కిట్టు కనీస సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని, పనిముట్లు కూలీలకు ఇవ్వాలని పనిచేసిన 15 రోజుల్లోపు డబ్బులు చెల్లించాలని డిమాండ్లను పరిష్కరించడం కోసం మీద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు జాన్పాటి జ్యోతి,వ్యవసాయకార్మిక,సిఐటియు, రైతు సంఘాల, నాయకులు మాదా శ్రీనివాస్, తులసి మొగ్గ వెంకన్న, బుద్ధారపు నాగరాజు , పొన్నాల జ్యోతి, మేకల నాగమణి, మాయ అనూష, ఏదుల కల్పన, మేకల భద్రమ్మ, పెద్ద లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఓటరు సవరణ గడువును పొడిగించాలి

- తహసీల్దార్ శారదకు సీపీఎం వినతి
- బూత్ స్థాయిలో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**గార్ల, జూలై 1 ( ప్రభాత గమనం) :**

ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియ గడువును కనీసం మరో నెల రోజుల పాటు పొడిగించాలని, దరఖాస్తుల సమర్పణకు ప్రజలకు మరింత సమయం ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం గార్ల తహసీల్దార్ శారదకు సిపిఎం ఆధ్వర్యంలో ఒక వినతిపత్రాన్ని



సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి మాట్లాడుతూ.. ఓటర్లలో సరైన అవగాహన లేకపోవడం, అవసరమైన పత్రాలను సేకరించుకోవడానికి తగిన సమయం దొరక్కపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు."సమయం సరిపోకపోవడం వల్ల ముఖ్యంగా దూర ప్రాంతాల్లో ఉండేవారు, వృద్ధులు, వికలాంగులు, పేదలు మరియు వలస కార్మికులు ఈ సవరణ ప్రక్రియలో భాగస్వాములు కాలేకపోతున్నారు. దీనివల్ల అర్హులైన అనేకమంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది." ప్రతి గ్రామం మరియు వార్డు పరిధిలో ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించి, అక్కడ ఓటర్ల జాబితాను బహిరంగంగా ప్రకటించాలి. తద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలి.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అప్లికేషన్లు సమర్పించడానికి గడువును మరో నెల రోజులు పొడిగించాలి.దరఖాస్తు విధానంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి బూత్ స్థాయిలో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. వృద్ధులు, వికలాంగులు, మహిళలు, వలస కార్మికులకు ఈ కేంద్రాల ద్వారా ప్రత్యేక సహాయం అందించాలి. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లెల నాగమణి, చింత మౌనిక, కుంట రామకృష్ణ, వంగూరి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతకు పెద్దపీట..

- శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యం
- ప్రజలకు చేరువగా సమర్థవంతమైన పోలీసింగ్ కు హామీ
- వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి



ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ అందుబాటులో ఉండే ప్రజా పోలీసింగ్‌ను అమలు చేస్తామని ఆమె పేర్కొన్నారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్వేతా రెడ్డి ఉదయం పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి చేరుకోగా సాయుధ పోలీసు బలగాలు గౌరవ వందనం సమర్పించాయి. అనంతరం కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ పోలీస్ కమిషనర్ నుంచి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనరేట్ అధికారులు, సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది నూతన కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా మొక్కలను, జ్ఞానానికి ప్రతీకగా నోట్‌బుక్‌లను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి మాట్లాడుతూ ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణ, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నిర్వహణ, మాదకద్రవ్యాల నిర్మూలన, సంఘ విద్రోహ కార్యకలాపాల అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందిస్తామని ఆమె తెలిపారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు సహా ప్రతి పౌరుడు నిర్భయంగా జీవించే వాతావరణం కల్పించడం పోలీసు శాఖ బాధ్యత అని అన్నారు. ప్రజలు పోలీసు శాఖపై విశ్వాసం ఉంచి తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తులు, సామాజిక శాంతికి భంగం కలిగించే ఘటనలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందని, పోలీసు-ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి, భద్రతలను మరింత పటిష్టం చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు కమిషనరేట్ యంత్రాంగమంతా సమిష్టిగా పనిచేస్తుందని నూతన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కమిషనరేట్‌కు చెందిన డీసీపీలు రవి, దార కవిత, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, వివిధ విభాగాల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొని నూతన పోలీస్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న సీపీ శ్వేత



ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్వేత, బుధవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం అమ్మవారి ఆశీస్సులు పొందేందుకు ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అధికారులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య కమిషనర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ గర్భగుడిలోకి వెళ్లిన కమిషనర్ శ్వేత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం కావాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, పోలీస్ శాఖకు సేవలందించే ప్రతి ఒక్కరికీ అమ్మవారి అనుగ్రహం కలగాలని ప్రార్థించినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. పూజలు అనంతరం ఆలయ వేద పండితులు కమిషనర్‌కు మహాదాశీర్వచనం నిర్వహించి వేదాశీర్వాదాలు అందించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అమ్మవారి శేష వస్త్రాలు బహూకరించి, పవిత్ర తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర, భద్రకాళి అమ్మవారి మహిమ, ఆలయ ఆధ్యాత్మిక విశిష్టతను అర్చకులు కమిషనర్‌కు వివరించారు. దర్శనానికి వచ్చిన భక్తులు కూడా నూతన పోలీస్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేయగా, ఆలయ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లను పోలీసులు పటిష్టంగా నిర్వహించారు. కమిషనర్ ఆలయ అధికారులతో కొద్దిసేపు మాట్లాడి ఆలయ నిర్వహణ, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ సుజాతతో పాటు పలువురు పోలీసు అధికారులు, ఆలయ ఈవో, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కొత్త బాధ్యతలు చేపట్టిన అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడం విశేషంగా నిలిచింది.



## పాఠశాలలు, అంగన్‌వాడీల్లో కలెక్టర్ సత్య శారద తనిఖీ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన పోషకాహారం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ డా. సత్య శారద బుధవారం ఖానాపూర్ మండలంలోని అశోక్‌నగర్, మనుబోతుల తండా గ్రామాల్లోని భవిత కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంబంధిత శాఖల అధికారులతో కలిసి పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజన నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. పర్యటనలో అశోక్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంబంధిత జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి (డీడబ్ల్యూఓ) నుంచి వెంటనే వివరణ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సేవలు నిర్దేశిత సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారమే నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆహారం నాణ్యత, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం ప్రతిరోజూ ఎలా అందుతోందనే విషయాలను విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల సమస్య ఉందని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సమస్య పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు, అంచనా నివేదికను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కూడా ఆదేశించారు. మనుబోతుల తండా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో బెంచీల కొరతను గుర్తించిన కలెక్టర్, కేజీబీవీలలో అందుబాటులో ఉన్న బెంచీలను వెంటనే ఆయా పాఠశాలలకు తరలించాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. అదే గ్రామానికి చెందిన మహిళలు తమ ప్రాంతానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరగా, వారి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఖానాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్, డీఎస్ఓ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఏఎస్సై గోపీచంద్‌కు ఘనంగా సన్మానం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

మహబూబాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో పదవీ విరమణ పొందిన తొర్రూరు పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ బి. గోపీచంద్ (1990 బ్యాచ్) ని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖలో మూడు దశాబ్దాలకు పైగా క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో ప్రజలకు సేవలందించడం అభినందనీయమన్నారు. పదవీ విరమణ అనేది సేవా జీవితానికి ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి ఆరంభమని ఎస్పీ పేర్కొన్నారు. ఇకపై కుటుంబ సభ్యులతో విలువైన సమయాన్ని గడుపుతూ, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ తర్వాత ఖాళీగా కూర్చోకుండా నిత్యం ఏదో ఒక శారీరక వ్యాయామం, నడక, యోగా వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను పాటిస్తూ, సమాజ సేవా కార్యక్రమాల్లో కూడా భాగస్వామ్యం కావాలని సూచించారు. అలాగే పోలీసు శాఖతో ఏర్పడిన అనుబంధాన్ని కొనసాగిస్తూ, తమ అనుభవాలను యువతతో, పోలీసు సిబ్బందితో పంచుకోవాలని, సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు డిఎస్పీ గంద్రతి మోహన్, సీఐ ఉపేందర్, ఆర్.ఐ నాగేశ్వర్రావు, పాల్గొని ఏఎస్ఐ బి. గోపీచంద్ గారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి పదవీ విరమణ అనంతర జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.

## విద్యతోనే ఉన్నత భవిష్యత్ సాధ్యం

- విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- పాఠశాలల్లో పరిశుభ్రత, మధ్యాహ్న భోజన నాణ్యత, ప్రయోగశాలల నిర్వహణపై ప్రత్యేక ఆదేశాలు



జనగాం, జూలై 1 (ప్రభాత గమనం):

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం, మెరుగైన క్రీడా సదుపాయాలు, ఆధునిక ప్రయోగశాలలు అవసరమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. విద్యార్థుల్లో ప్రాథమిక అభ్యసన సామర్థ్యాలను పెంపొందించి, విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. బుధవారం రఘునాథపల్లి మండలంలోని కేజీబీవీ, ఖిలాషాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అన్ అకాడమీ తరగతులను ప్రారంభించి, విద్యార్థులకు గణితంలో సులభ పద్ధతులతో కొన్ని లెక్కలను స్వయంగా బోధించారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్య ద్వారానే జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని, మంచి ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా నిలవాలని విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థుల పఠన, అభ్యసన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను ఎంతవరకు అర్థం చేసుకుంటున్నారో తెలుసుకుంటూ ఉపాధ్యాయులతో చర్చించారు. ప్రతి విద్యార్థిలో ప్రాథమిక అభ్యాస నైపుణ్యాలు పెంపొందించేలా బోధన సాగించాలని సూచించారు. అన్ అకాడమీ తరగతులను సద్వినియోగం చేసుకుని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి ఆవరణను శుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించిన కలెక్టర్ వంటశాల నిర్వహణ, ఆహార నాణ్యత, పరిశుభ్రతపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్, గణిత, సైన్స్ ప్రయోగశాలలను పరిశీలించి, ప్రతి విభాగాన్ని క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, శాస్త్రీయ పరిశోధనల్లోనూ విద్యార్థులు రాణించేలా పాఠశాలల్లో అనుకూల వాతావరణం కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.




## 'సర్' పై సందేహాల నివృత్తి

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం
- ఓటర్ల జాబితా ప్రక్షాళనకు సహకరించాలని సూచన

మహబూబాబాద్, జూలై 01(ప్రభాత గమనం):

బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వి.సి. హాలులో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (సర్ -స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్) అమలుపై వివిధ రాజకీయ పార్టీలకు ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్నేహ శబరిష్ అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్-2026 కార్యక్రమం షెడ్యూల్, ఇంటింటి సర్వే, ఫారాల స్వీకరణ, క్లెయిమ్స్ ,అబ్జెక్షన్ల ప్రక్రియపై పార్టీల నాయకులు లేవనెత్తిన అంశాలకు కలెక్టర్ సవివరంగా సమాధానం ఇచ్చారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ విజయవంతం కావడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ సహకరించాలని కోరారు. 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ధృవీకరించి నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఎలా నింపాలో వివరించే ట్యుటోరియల్ వీడియోలను సిద్ధం చేశామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి సందేహానికి సమాధానం ఇవ్వబడుతుందని తెలిపారు. దోషరహిత ఓటరు జాబితా రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీల సహకారం తప్పనిసరి. సందేహాలుంటే నేరుగా నా దృష్టికి గానీ, ఈఆర్వో దృష్టికి గానీ తీసుకురావాలి" అని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, పరిపాలన అధికారి పవన్ కుమార్, భారతీయ జనతా పార్టీ నుండి వేముల కోమల్ వెంకట్ రెడ్డి, శ్యాం సుందర్ శర్మ, సీతారాం నాయక్, కాంగ్రెస్ పార్టీ నుండి సురేష్ నాయుడు, బి.ఆర్.ఎస్ పార్టీ నుండి మార్నేని వెంకన్న, బి.ఎస్.పి పార్టీ నుండి విజయకాంత్, టి.డి.పి నుండి రామారావు, అధికారులు పాల్గొన్నారు.



## బంధూక్ వీడి హలం పట్టి..

- వ్యవసాయం చేస్తున్న మావోయిస్ట్ సభ్యురాలు
- ఇటీవలే లొంగిపోయిన పోడియం లక్ష్మీ

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 1(ప్రభాత గమనం):

మావోయిస్టు పార్టీలో డివిజన్ కమిటీ సభ్యురాలుగా చేతిలో తుపాకీ పట్టి అడవులలో తిరిగిన యువతి నేడు హలంపట్టి పొలం పనులలో నిమగ్నమై కనిపిస్తుంది.. చర్ల మండలం,మారుమూల గిరిజన గ్రామం రాళ్ళాపురానికి చెందిన పొడియం లక్ష్మి (28) కొన్నేళ్ల కిందట కుటుంబాన్ని వదిలి సాయుధ పోరాట బాట పట్టింది.. మావోయిస్టు పార్టీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ సభ్యురాలుగా పనిచేసి ఇటీవల డీజీపీ ఎదుట లొంగిపోయింది.. నాడు తన అమ్మమ్మ వద్ద ఉంటూ పోడుభూములో హాలంపట్టి పొలం దున్నుతూ అడవి ఉత్పత్తుల సేకరణలో నిమగ్నమై ఉంది.. ప్రభుత్వం ప్రకటించిన 4 లక్షల రివార్డును అందిస్తే తన ఉపాధికి బాటలు వేసుకుంటానని ఆమె ప్రభుత్వాన్ని కోరుతుంది.

## 'రైతు భరోసా'కు కోతలు పెడితే సహించం

- గత మూడు సీజన్ల బకాయిలను వెంటనే జమ చేయాలి
- ఎకరాల పరిమితి లేకుండా ప్రతి రైతుకూ పెట్టుబడి సాయం అందించాలి
- ప్రభుత్వ వైఖరిపై 'రైతు మహా సంగ్రామం'కు సిద్ధం :మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్



గార్ల ,జూలై 1 (ప్రభాత గమనం) :

తెలంగాణలో సాగు కాలం ప్రారంభమైనా కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతు భరోసా' నిధుల విడుదలలో తీవ్ర కాలయాపన చేస్తోందని, అర్హులపై ఆంక్షల పేరుతో కోతలు విధిస్తూ అన్నదాతలను వంచిస్తోందని బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గత మూడు సీజన్ల బకాయిలను కలిపి, ఎలాంటి ఎకరాల పరిమితి లేకుండా ప్రతి రైతు ఖాతాలో పెట్టుబడి సాయాన్ని జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రభుత్వంపై పోరాటానికి పిలుపునిచ్చారు."అధికారంలోకి వచ్చే ముందు ప్రతి ఏటా, ప్రతి ఎకరానికి రూ. 15,000 ఇస్తామని ఆర్భాటపు హామీలు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. గద్దెనెక్కిన తర్వాత రైతులకు 'భరోసా' కాకుండా వెన్నుపోటు పొడిచారు" అని రమేష్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నేతృత్వంలో పంట కాలం ప్రారంభానికి ముందే విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయానికే నేరుగా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ అయ్యేదని గుర్తు చేశారు. కానీ నేడు కాంగ్రెస్ రాజ్యంలో పంట కాలం ముగుస్తున్నా సాయం అందక, రోజుకో సమీక్ష పేరుతో కాలయాపన చేస్తూ రైతులను మళ్లీ వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరిగేలా అప్పుల ఊబిలోకి నెట్టారని మండిపడ్డారు.గత ఖరీఫ్ సీజన్‌లో కేవలం రెండు ఎకరాల లోపు ఉన్న రైతులకు మాత్రమే అరకొరగా నిధులు వేసి, మెజారిటీ రైతాంగాన్ని విస్మరించారని రమేష్ ఆరోపించారు. భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ సాయం అందుతుందని ఆశపడ్డ రైతులను.. ఐటీ పరిమితులు, ఎకరాల ఆంక్షల పేరుతో కొత్త మెలికలు పెడుతూ విడదీయడం ముమ్మాటికీ దగా చేయడమేనని అన్నారు.ప్రభుత్వం ఇప్పటివరకు ఎగ్గొట్టిన గత మూడు సీజన్ల రైతు భరోసా బకాయిలను, ప్రస్తుత నిధులతో కలిపి తక్షణమే విడుదల చేయాలి.పంటలు ఎండిపోయాక ఇచ్చే సాయం వల్ల ప్రయోజనం లేదు. గతంలో లాగా సాగు పనులు ప్రారంభం కాకముందే రైతుల చేతికి డబ్బులు అందాలి.ఎకరాల పరిమితి లేకుండా, ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతి రైతుకూ, ప్రతి ఎకరానికీ పెట్టుబడి సాయాన్ని వివక్ష లేకుండా అందించాలి.అన్నదాతల కన్నీరు ఏ ప్రభుత్వానికైనా మంచిది కాదని హెచ్చరించిన శీలంశెట్టి రమేష్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తన మొండివైఖరిని వీడాలన్నారు. పూర్తి నిధులను తక్షణమే విడుదల చేయని పక్షంలో, గ్రామగ్రామాన రైతులను ఏకం చేసి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున 'రైతు మహా సంగ్రామం' పేరిట ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## అయోధ్య రాముడి సొమ్ము.. మరుగుదొడ్లలో దాచి..!

న్యూఢిల్లీ, జూలై 1(ప్రభాత గమనం):

అయోధ్య రామాలయంలో విరాళాల సొమ్ము పక్కదారిపట్టడంపై జరుగుతున్న విచారణలో పలు ఆసక్తికర విషయాలు వెలుగుచూస్తున్నాయి. విరాళాల సొమ్ము లెక్కింపులో చేతివాటం ప్రదర్శించిన సిబ్బంది తాము దొంగిలించిన డబ్బును తమవెంట తీసుకెళ్లకుండా మరుగుదొడ్లలో దాచిఉంచారు. ఆ తరువాత అక్కడినుంచి సొమ్ములు బయటకు తరలించినట్లు ఇంటరాగేషన్‌లో నిందితుడు అవినాశ్ శుక్లా తెలిపాడు. రెండు గంటల విచారణలో లెక్కింపు వ్యవస్థలో లొసుగులను, కోట్లాది రూపాయిలు ఎలా కొట్టేసింది, తర్వాత జరిగిన సంఘటనల క్రమాన్ని వివరించాడు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374